క్లుప్తంగా

ఆదంషఫీకి పాన్ ఇండియా ఎడ్యుకేషన్ అవార్డు



చిలకలూరిపేట: ఏపీ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ప్రైవేటు ఉపాధ్యాయులకు పాన్ ఇండియా ఎడ్యుకేషన్ అవార్డ్స్ కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. కంప్యూటర్ విద్యావిభాగంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను పట్టణానికి చెందిన మైస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు షేక్ ఆదంషఫీకి ఇస్రో శాస్త్రవేత్త చందు చేతుల మీదుగా ఈ పురస్కారం అందజేశారు. మైస్ కంప్యూటర్ ఇన్స్టిట్యూట్‌తో పాటు వివిధ కళాశాలల్లో కంప్యూటర్ ఎడ్యుకేషన్‌లో విద్యార్థులకు శిక్షణ ఇస్తూ వారి ఉజ్వల భవిష్యత్ కోసం గత 15 ఏళ్లుగా చేస్తున్న కృషికి గాను ఆయనకు ఈ అవార్డు లభించింది. అవార్డు అందుకున్న ఆయనకు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్ తదితరులు అభినందనలు తెలిపారు.

కళా ఉత్సవ్‌లో జడ్పీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

వినుకొండ: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో జిల్లా విద్యా శిక్షణ సంస్థ బోయపాలెంలో నిర్వహించిన కళా ఉత్సవ్-2025 పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు పాఠశాల హెచ్‌ఎం బి. శైలజ తెలిపారు. ఈ మేరకు స్థానిక పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల అభినందన సభలో ఆమె మాట్లాడుతూ నాటక విభాగంలో గిడుగు ఏకపాత్రాభినయం ప్రదర్శించిన 10వ తరగతి విద్యార్థినీ ఈవీవీ శ్రీలక్ష్మికి ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయిలో 3వ బహుమతి లభించిందని, శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, జానపద నృత్యంలో విద్యార్థులు పాల్గొని ప్రశంసలు పొందారన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు గైడ్ ఉపాధ్యాయినీగా డాక్టర్ వి.పద్మ వ్యవహరించారు.

రొంపిచర్లలో ప్రారంభమైన వ్యవసాయ పనులు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. గత మూడు రోజులుగా మధ్యాహ్నం నుండి వర్షాలు కురియటంతో వ్యవసాయ పనులను అర్ధంతరంగా నిలుపుదల చేసి ఇంటి కొస్తున్నారు. అయితే సోమవారం ఉదయానికి మండల కేంద్రంలో 3.2 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. ఉదయం నుంచి వాతావరణం పొడిగా ఉండటంతో మాగాణి వ్యవసాయ పనులన్నీ ఎలాంటి అంతరాయంలేకుండా సాగాయి.

దేవాలయాల పునర్నిర్మాణానికి నిధులు

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు గ్రామంలో శ్రీ సోమేశ్వర స్వామి, వేణుగోపాలస్వామి దేవాలయాల కామన్ గుడ్ ఫండ్ లో నిధులు మంజూరయ్యాయని ఇన్‌చార్జ్ దేవదాయ శాఖ అధికారి సి.హెచ్.శివ నాగిరెడ్డి సోమవారం తెలిపారు సోమేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ 2.35 కోట్లు, వేణుగోపాలస్వామి ఆలయ పునర్మాణానికి కోటి రూపాయలు సీజీఎఫ్ నిధులు మంజూరయ్యాయని ఈవో చెప్పారు. గ్రామస్తుల సహకారంతో ఆయా దేవాలయాల పునర్మాణానికి సోమేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి లకు సంబంధించి రూ 66.66 లక్షలు,రూ 30 లక్షలు చెల్లించాల్సి ఉందని త్వరలో ఆలయాల పునర్నిర్మాణం చేపడతామని ఈవో తెలియజేశారు.

విద్యార్థులకు పోటీ పరీక్షలు

బొల్లాపల్లి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వారధి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోటీ పరీక్ష సోమవారం నిర్వహించారు. మండలంలోని జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్, కేజీబీవీలకు చెందిన విద్యార్థులు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. ఆయా పాఠశాలలో 8, 9, 10 తరగతులకు చెందిన సుమారు 30 మందికి పైగా విద్యార్థులు ఈ పోటీ పరీక్షలకు హాజరయ్యారు. వ్యాసరచనకు సంబంధించి విద్యార్థులకు చదువు ప్రాముఖ్యత, డిబేట్‌కు సంబంధించి శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యంలో దేనికి ప్రాధాన్యత పై పోటీ పరీక్షలు నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి-2 వివరించారు. మండలస్థాయి పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో జడ్పీ హైస్కూల్ బండ్లమోటుకు చెందిన 8,9,10, తరగతుల విద్యార్థులు వ్యాసరచనలో సువర్ణ జ్యోతి, దేవేంద్ర నాయక్, శ్రీనివాసరావు లు, డిబేట్ లో కేజీబీవీకి చెందిన డి.చంద్రకళ,బి తులసి భార్గవి బాయి, వి.ప్రమీల బాయిలు ప్రథమ స్థానంలో గెలుపొందినట్లు విద్యాశాఖ అధికారి 2 తెలిపారు కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ జూడో జట్ల ఎంపిక

చిలకలూరిపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జూడో, గట్కా జిల్లా జట్ల ఎంపిక స్థానిక ఏఎంజీ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించారు. అండర్-14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు విడివిడిగా జట్లను ఎంపిక చేశారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల నుంచి 260 మంది విద్యార్థులు ఈ ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్నారు. జూడో జట్ల ఎంపిక విద్యార్థుల బరువును బట్టి నిర్వహించగా, గట్కా జట్ల ఎంపిక వారి వయసుల ఆధారంగా నిర్వహించటం జరిగింది. కార్యక్రమంలో ఏఎంజీ హైస్కూల్ హెచ్‌ఎం కె.కృపాదానం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ పి.నరసింహారావు, ఎస్.సురేష్‌కుమార్, డాక్టర్ వి పద్మావతి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియావస్థ!

వారంతా రైతులు. సూర్యోదయం / సూర్యాస్తమయం రెండూ పొలంలోనే చూస్తారు. పొలం పనుల్లో ఎప్పుడూ నిమగ్నమై ఉండే వారంతా ఇదిగో ఇలా యూరియా కోసం గ్రోమోర్ సెంటరు ముందు పడిగాపులు కాస్తున్నారు. ప్రస్తుతం నాట్లు వేసుకునే సమయం. ఎక్కువ భాగం వారంతా పొలంలోనే ఉండాల్సిన సమయం. అలాంటి పనులన్నీ పక్కన బెట్టి పొలానికి బలాన్నిచ్చే యూరియా సంచి కోసం ఒకరి వెనుక ఒకరు ఇలా గంటల తరబడి ఆధార్ కార్డులు చేతబట్టుకుని నిలుచుని మరీ కాలం వెళ్లదీస్తున్నారు. శావల్యాపురంలోని గ్రోమోర్ సెంటరుకు యూరియా సంచులు వచ్చాయని సమాచారం రావటంతో సోమవారం ఉదయం వందల సంఖ్యలో రైతులు సెంటరుకు చేరుకుని ఇలా ఎదురుచూశారు. విషయం తెలుసుకున్న ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు, పోలీసు సిబ్బంది, మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావులు చేరుకున్నారు. రైతులు ఎరువుల కోసం ఆందోళన పడాల్సిన పనిలేదని వారంతా సర్ది చెప్పారు. తగిన ఏర్పాట్లు చేశారు. అయితే, తమకు 25 మెట్రిక్ టన్నులు రాగా 272 మంది రైతులకు రెండు సంచులు చొప్పున అందజేశామని ఏవో రామారావు వెల్లడించారు. ఆయనతో పాటు తహసీల్దారు యం.అర్జున్‌నాయక్, ఎఎస్ఐ బాజి, ఆర్ఐ చంద్రబాబు, వీఆర్వో రమాదేవి, మన గ్రోమోర్ సెంటరు మేనేజరు సురేంద్ర తదితరులు ఉన్నారు.



–శావల్యాపురం



కావాల్సినంత ఎరువివ్వరు!

రైతులకు కావల్సిన కాంప్లెక్స్ ఎరువుల పంపిణీలో గణపవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం వెనుకబడింది. మండల పరిధిలో గణపవరం, నాదెండ్ల, తూబాడు గ్రామాల్లో మూడు పీఏసీఎస్‌లుండగా సాతులూరులో గ్రోమోర్ కేంద్రం ఉంది. నాదెండ్ల, తూబాడు సొసైటీలు, సాతులూరు గ్రోమోర్ సెంటర్‌కు ఇప్పటి వరకు 680 మెట్రిక్ టన్నులు ఎరువులు పంపిణీ చేశారు. అయితే గణపవరం సొసైటీ పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ 60 టన్నులు మాత్రమే యూరియా అందింది. ఇప్పటికే 40 టన్నులు అందించగా, సోమవారం మరో 20 టన్నులు సొసైటీకి చేరాయి. వీటిని మంగళవారం రైతులకు పంపిణీ చేయనున్నారు. 45 కేజీల యూరియా బస్తా ధర రూ.266లుగా ప్రభుత్వం నిర్ణయించింది. నిన్నా మొన్నటి వరకూ ప్రైవేటు వ్యాపారులు బహిరంగ మార్కెట్లో రూ.350–400ల వరకూ యూరియా విక్రయించారు. వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు చేస్తుండటంతో గుట్టు చప్పుడు కాకుండా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.

– నాదెండ్ల

ఘనంగా ఇంజినీర్స్ డే



పంచాయతీరాజ్ కార్యాలయంలో విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న అధికారులు



ఎస్ఈసీలో భూగర్భజల ఏడీ రామబాలాజిరెడ్డిని సత్కరిస్తున్న అధ్యాపకులు



జేఎన్‌టీయూఎన్‌లో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు



కొమ్మసానిని సన్మానించి షీల్డు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్: ఇంజినీర్స్ డేను మండలంలోని కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 167వ జయంతి, 27వ ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయంలోని విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద అధికారులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఇంజనీర్ కె.హరనాథ్, టెక్నికల్ ఆఫీసర్ సి.హెచ్.ఉమాధవ్, మేనేజర్ సాంబశివరావు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళి అర్పించారు. జిల్లా భూగర్భజల అసిస్టెంట్ డైరెక్టర్ కె.రామబాలాజి రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఆధునిక భారత నిర్మాతల్లో విశ్వేశ్వరయ్య ఒకరని అవనిగడ్డ హుస్సేనమ్మ యల్లమందయ్య ట్రస్ట్ అధ్యక్షుడు గురులింగం తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో లాల్‌బహదూర్ మున్సిపల్ పాఠశాలలో ఇంజినీర్స్ డేను నిర్వహించారు. ఇంజినీరుగా దేశానికి చేయగలిగిన సేవ ఎలాంటిదో విశ్వేశ్వరయ్య జీవితం బోధిస్తుందని విద్యార్థులకు తెలియజేశారు. జేఎన్‌టీయూఎన్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్. శ్రీనివాసరావు, వైస్‌ప్రిన్సిపల్ కె.శోభన్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐఎంఏ భవనంలో..

నరసరావుపేట: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)హాలులో సోమవారం ది నరసరావుపేట లైసెన్స్‌డు ఇంజినీర్స్ అండ్ సర్వేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో పాటు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, దివ్యాంగుల సంక్షేమసంఘ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు వేర్వేరు సమయాల్లో అతిథులుగా పాల్గొన్నారు.

ఈశ్వర్‌లో ఇన్నోవేషన్ గెలాక్సీ ఫౌండేషన్ ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ లావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్: సాంకేతిక ఆవిష్కరణల ద్వారా గ్రామీణ ప్రాంతాల సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డేను పురస్కరించుకొని సోమవారం ఈశ్వర్ ఇన్నోవేషన్ గెలాక్సీ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ లావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కళాశాలలోని విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద అతిథులు నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు మాట్లాడుతూ సాంకేతిక రంగంలో ముందజలో ఉండటానికి ఇలాంటి ఇన్నోవేషన్ ఫౌండేషన్లు కీలకమని తెలిపారు. విద్యార్థులు చూపిస్తున్న ప్రతిభ దేశ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను వినూత్న ఆలోచనల రూపంలో మార్చుకోవాలన్నారు. ఇన్నోవేషన్ గెలాక్సీ ఫౌండేషన్ ప్రారంభించడం కొత్త తరానికి అవకాశాల వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఇన్‌వెస్‌టీజ్ సీఈవో ఇంద్రజిత్ అన్నె టెక్నాలజీ మన జీవితాన్ని మార్చేస్తుందన్నారు. విద్యార్థులు ఇన్నోవేటివ్ ఆలోచనలతో ముందుకు రావడం ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో టీఎంఐ హైద్రాబాద్ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ ఇమ్రాన్ షేక్, జేఎన్‌టీయూఎన్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, బైట ఎక్స్‌ఎల్ సహ వ్యవస్థాపకుడు చరణ్, కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మస్తాన్ షరీఫ్, కార్యదర్శి డాక్టర్ కరీం మొహిద్దీన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నజీమా, ఐఐసీ కోఆర్డినేటర్ డాక్టర్ షేక్ ముజీర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితుడికి న్యాయం చేయాలంటూ ధర్నా



ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వలన పూర్తిగా వికలాంగుడుగా మారిన దళితుడు వర్ల సాగర్ బాబుకు న్యాయం చేయాలని, కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరుతూ బాధితులతో కలిసి ప్రజాసంఘాల నాయకులు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాచేసి వినతిపత్రం సమర్పించారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ కారంపూడి మండలం పెద్ద కొదమగుండ్లకు చెందిన లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్‌లు వెంకటేశ్వర్లు, పరబ్రహ్మాచారి కరెంటు మీటర్ రీడింగ్ పనులు చేసుకుంటున్న సాగర్‌ను బెదిరించి దేవుడు రథోత్సవం జరుగుతున్నందున స్తంభం ఎక్కి విద్యుత్ వైర్లు కట్‌చేయాలని బలవంతంగా స్తంభం ఎక్కించారన్నారు. దీంతో విద్యుదాఘాతానికి గురై కిందపడి వెన్నెముక విరిగిపోయి పూర్తి వికలాంగుడిగా మారాడన్నారు. దీనికి కారకులైన ఇద్దరు ఉద్యోగులపై చర్యలు తీసుకొని బాధితుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరినా ప్రభుత్వం నుంచి స్పందన లేక పోవడంతో సొంత గ్రామమైన చేజర్లలో ఆ బాధిత కుటుంబం ధర్నాకు దిగిందన్నారు. అతని న్యాయమైన పోరాటానికి ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం వెంటనే అతనికి న్యాయం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి రెడి బోయిన ప్రసన్నకుమార్, పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. కోటనాయక్, ఏపీ గిరిజన సంఘాల సమాఖ్య నాయకులు శీను నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు బహుమతులు

నరసరావుపేట ఈస్ట్: మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ఐటీసీ సౌజన్యంతో విద్యార్థినులకు వ్యాసరచన, రీ సైక్లింగ్ కోసం పాత పుస్తకాల సేకరణ పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు అందించారు. రీ సైక్లింగ్ కోసం పాత పుస్తకాలు సేకరించిన అఖిల, బి.యశస్వినికి ప్రోత్సాహకంగా పుస్తకాలు, పెన్నులు, ఆట వస్తువులు అందించారు. కార్యక్రమంలో ఐటీసీ సిబ్బంది రాజయ్య, షఫీ, కృష్ణసౌజన్య పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికీ తెలిచేసేందుకే పోటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గార్లపాడులో పర్యటించిన డీఎల్‌పీవో



రొంపిచర్ల: మండలంలోని నల్లగార్లపాడు గ్రామంలో సోమవారం డీఎల్‌పీవో లక్ష్మణ్‌రావు పర్యటించారు. గ్రామానికి చెందిన సాగర్ తమ బజారులో మురుగు నిల్వ ఉంటుందని సమస్య పరిష్కరించాలని గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకున్నారు. సాగర్ ఫిర్యాదు మేరకు డీఎల్‌పీవో పరిశీలించి సమస్యను పరిష్కరించారు. వీరి వెంట డిప్యూటీ ఎంపీడీవో బి.వి. కోటేశ్వరరావు, ఆ గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో కర్లకుంట పశువైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ సాయి మహేష్‌రెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ 15వ తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ టీకాలను వేశే కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ చేపట్టిందన్నారు. తమ పశువైద్యశాల పరిధిలో 7500 వరకు పశువులు ఉండగా ఆ మొత్తానికి టీకాలు వేసేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. తమ వైద్యశాల పరిధిలో 11 గ్రామాలు ఉన్నాయన్నారు. కార్యాచరణ ప్రకారం పశువులన్నిటికీ టీకాలు వేస్తామన్నారు. గోగులపాడు గ్రామంలో 240 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

22న హైదరాబాద్‌లో ఎస్సీ వర్గీకరణ సభ



శావల్యాపురం: తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి కోసం ఈనెల 22న చేపట్టిన కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోట సుబ్బు మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రం శావల్యాపురంలో ఎమ్మార్పీఎస్ మండల స్థాయి నూతన అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భారత దేశంలో తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చట్టం చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. హైదరాబాదు నగరంలో రవీంద్ర భారతిలో జరగనున్న ఈ సదస్సులో అందరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నూతన మండల అధ్యక్షులుగా కలుపుకూరి ప్రవీణ్ కుమార్ మాదిగను ఏకగ్రీవంగా ఏన్నుకున్నారు. అనంతరం కరపత్రాలు పంపిణి చేశారు. నియోజకవర్గ అధ్యక్షులు కలుపుకూరి ఏసురత్నం మాదిగ, గోళ్ళ సుధాకర్ మాదిగ పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి కృషి అభినందనీయం



ఒయాసిస్ సంస్థ సభ్యులతో కరిముల్లా

చిలకలూరిపేట: మహిళాభ్యున్నతికి ఒయాసిస్ సంస్థ చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ కరిముల్లా చెప్పారు. ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఒయాసిస్ సంస్థ సభ్యులు గత 20 ఏళ్ల సమాజ సేవ కార్యక్రమాల్లో పాల్గొనడం ఆదర్శనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా దాతలు గట్టా హేమకుమార్, జయమణి దీపక్, మున్నలూరి శివ శంకర్, లక్ష్మీ సామ్రాజ్యంల ఆర్థిక సహాయంతో ఇరువురు మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. వైద్య ఖర్చుల నిమిత్తం శ్రీనివాసరావు అనే వ్యక్తికి సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కరణం విజయలక్ష్మి, కోలా విజయలక్ష్మి, డాక్టర్ ప్రఫుల్లాదేవి పాల్గొన్నారు.

అందరూ పనిచేస్తే స్వచ్ఛ నరసరావుపేట సాధ్యం

సూచించిన మున్సిపల్ కమిషనర్



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట: పర్యావరణ కార్యదర్శులు, శానిటరీ మేస్త్రీలు, కార్మికులు కేటాయించిన సమయంలో పనిచేస్తేనే స్వచ్ఛ నరసరావుపేట సాధ్యమౌతుందని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు పేర్కొన్నారు. సోమవారం కార్యదర్శులు, మేస్త్రీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లాలో సమావేశం నిర్వహించారు. ప్రతిరోజూ ఉదయం 5.30 నుంచి 10.30 వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు కేటాయించిన వార్డుల్లో వర్కర్లు తప్పకుండా పనిలో పాల్గొనాలన్నారు. పనులను శానిటరీ మేస్త్రీలు, పర్యావరణ కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ, ఎత్తైన కల్వర్టులు, విద్యుత్ స్తంభాలు, ఫ్లై ఓవర్లు, డివైడర్లు అంచుల చుట్టూ వ్యర్థాలు వెంటనే తొలగించాలన్నారు. టీషాపులు, టిఫిన్‌బండ్లు, తోపుడు బండ్లు, పానీపూరీ బండ్లు వారు డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకొని చెత్తను అందులో వేయాలన్నారు. పద్ధతి మార్చుకోకపోతే భారీ జరిమానా విధించాలని అన్నారు. వాణిజ్య సముదాయాలు, కళాశాలలు, స్కూళ్లలో సింగిల్‌యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలన్నారు. రోడ్లపై పడేసిన చెట్లకొమ్మలను యుద్ధప్రాతిపదికన తొలగించాలని సూచించారు. హోంకం పోస్టు, టెర్రస్ గార్డెన్ ప్రోత్సహించాలన్నారు. శానిటేషన్ మెరుగుపర్చి పట్టణం పరిశుభ్రంగా ఉండేలా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యతని, దీనికి ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

సచివాలయ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్ శ్రీహరిబాబుకు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

చిలకలూరిపేట: వార్డు, గ్రామ సచివాలయాల సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక చిలకలూరిపేట శాఖ నాయకులు కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబును కలసి వేదిక ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాల వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ సిబ్బందికి ఇంటింటికీ తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కల్పించాలని కోరారు.గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలన్నారు. సమయ పాలన లేని ఒత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులకు అమలు అవుతున్న రికార్డు అసిస్టెంట్ క్యాడర్ నుంచి జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు మార్పు చేయాలన్నారు. అన్ని విభాగాల వారీగా ప్రమోషన్ ఛానల్స్ ఏర్పాటు చేసి జిల్లాల వారీగా సీనియారిటీ జాబితా విడదల చేయాలన్నారు.

సచివాలయ ఉద్యోగులకు స్టేషన్ సీనియారిటీ ఆధారంగా పారదర్శక బదిలీలు జరిగే ప్రత్యేక విధివిధానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1.25 లక్షల మంది సచివాలయ ఉద్యోగులు వివిధ సమస్యల కారణంగా మనోవేదనకు గురౌతూ ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఉద్యోగుల మనోభావాలకు అనుగుణంగా సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కృష్ణ, సాగర్‌బాబు, సౌమ్య, రత్నప్రసాద్, పట్టణ పరిధిలోని వార్డు సెక్రటరీలు పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డుల పంపిణీపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న తహసీల్దార్ జెట్టి విజయశ్రీ

యడ్లపాడు: మండలంలో నూతన రేషన్‌కార్డుల (స్మార్ట్ కార్డులు) పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ జెట్టి విజయశ్రీ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించి సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్‌కార్డుల పంపిణీకి ముందుగా చేయాల్సిన డెస్క్‌వర్క్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. రేషన్‌షాపుల వారీగా ఒక సచివాలయం ఉద్యోగిని అనుసంధానం చేసినట్లు వెల్లడించారు. దీనివల్ల కార్డుల పంపిణీ మరింత సులభమవుతుందని అధికారులు తెలిపారు. ప్రతిలబ్ధిదారుడికి స్మార్ట్‌రేషన్ కార్డులు పంపిణీ చేసేందుకు సచివాలయం సిబ్బంది మొబైల్ అప్లికేషన్‌తో ఈ–పోస్ యంత్రాల ద్వారా డీలర్లు జారీచేసే విధానాన్ని కూడా వారికి వివరించారు. ఈ ప్రక్రియ వల్ల కార్డుల పంపిణీ వేగంగా, పారదర్శకంగా జరుగుతుందని అధికారులు తెలిపారు. తహసీల్దార్ పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశానికి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ముప్పాళ్ళ సుబ్బారావు, కార్యాలయ ఉప తహసీల్దార్, ఎస్.అనురాధ, రేషన్ షాప్ డీలర్లు, సచివాలయం సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు హాజరయ్యారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



స్మార్టు కార్డును చూపిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: పట్టణంలో స్మార్టు రేషన్‌కార్డుల పంపిణీకి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శ్రీకారం చుట్టారు. 24వ వార్డులో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేసిన అనంతరం ఇంటింటి తిరిగి లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో మొత్తం 6,34,000 రేషన్ కార్డులు ఉన్నాయని, వీటన్నింటినీ స్మార్ట్ రేషన్ కార్డులుగా మార్చి లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమం జరుగుతుందని అన్నారు. కార్డులు క్యూఆర్ కోడ్‌తో అధునాతన సాంకేతికతను కలిగి ఉన్నాయని, ఇవి పారదర్శకత, సమర్థవంతమైన సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వెల్లడించారు.

ఎంపీడీవోగా పదోన్నతి

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఈవోపీఆర్‌డీ పి.సుగుణ ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. ప్రస్తుతం ఆమె ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా వ్యవహరిస్తున్నారు.